క్లుప్తంగా

బాధ్యతగా మొక్కలు నాటాలి



తొర్రూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. పట్టణంలోని పదో వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కమిషనర్ పుష్పాల సరస్వతి, ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు భూసాని రాము, శంకర్, శంకర్, ఏతం రంజిత్, మేనేజర్ కట్ట స్వామి, నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ: మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ అన్నారు. మండల కేంద్రంలోని 3వ వార్డు ఎంఎస్పీ సీనియర్ నాయకుడు జినక స్వామి అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ.. ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభకు ప్రతి మాదిగ, ఉపకులాలు మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, జనక వెంకన్న, శ్రీరాములు, వెంకన్న, రవి పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

బయ్యారం: మండలంలోని జగత్‌రావుపేటలో గిరిజనుడు బానోత్ కోటేష్ పాకను ధ్వంసం చేసిన ఎంపీపీ మౌనికతోపాటు ఆమె అనుచరులపై చర్య తీసుకోవాలని న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి మోకాళ్ల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. అధికార పార్టీ అండతో ఎంపీపీ ఆమె అనుచరులు సంబంధం లేని భూమిలో ప్రవేశించి గిరిజనులపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. నాయకులు పద్మ, పొమ్మయ్య, భిక్షం, నర సింహా, వీరభద్రం పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలి

నెహ్రూసెంటర్: పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికుల కూలిరేట్లను పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వీరయ్య మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు రోజుకు రూ.600 చెల్లించాలన్నారు. ఈసమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర మహేష్, వంగూరు వెంకటేశ్వర్లు, తిలక్‌బాబు, ఉపాధ్యక్షులు రాజన్న పాల్గొన్నారు.

సీతక్కకు ఘన స్వాగతం

గంగారం: అమెరికాలో జరిగిన తానా సభలకు వెళ్లి తిరిగి వచ్చిన ఎమ్మెల్యే సీతక్కకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే సీతక్కను కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ పెనుక పురుషోత్తం, ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, జెడ్పీటీసీ ఈసం రమ సురేష్, కిసాన్ సెల్ అధ్యక్షుడు ధనసరి సారయ్య, ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సువర్ణపాక జగ్గారావు పాల్గొన్నారు.

ఐక్యతగా అభివృద్ధి సాధించాలి

గూడూరు: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల యాదవుల సమావేశంలో తెలంగాణ యాదవ మహాసభ మండల అధ్యక్షుడిగా మచ్చర్ల గ్రామానికి చెందిన గుండెబోయిన మల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల మురళీయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ మాట్లాడారు. యాదవులు ఐక్యతగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ ఉపాధ్యక్షుడు నేతుల వెంకన్నయాదవ్, జిల్లా కార్యదర్శి బాబూరావ్‌యాదవ్ పాల్గొన్నారు.

వాగులు, చెరువులకు జలకళ

డోర్నకల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నా. శుక్రవారం డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగుకు భారీ వర్షాలతో వరద ప్రవాహం పెరిగింది.

నర్సింహులపేట: మండలంలోని అకేరు వాగుపై నిర్మించిన కొమ్ములవంచ, జయపురం, కౌంసల్యాదేవిపల్లి, ముంగిమడుగు చెక్‌డ్యాంల మీదుగా వాగులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు

మరిపెడ రూరల్: ఇటీవల నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఉల్లెపల్లి శివారు ఆకేరు వాగు చెక్ డ్యామ్ శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తుంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరు

గార్ల: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గార్ల సమీపంలోని పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్ల నుంచి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

చిన్నగూడూరు: మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకేరు వాగు నిండుకుండలా మారి జలకళను సంతరించుకుంది. ఆకేరు వద్ద సాయంత్రం వేళ సందడి వాతావరణం నెలకొంటుంది.

తొర్రూరు రూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో చెరువులకు జలకళ సంతరించుకుంది. మండలంలోని గుర్తూరు, హరిపిరాల, మాటేడు చెరువులు పూర్తిగా నిండాయి.



కొత్తగూడ: మత్తడి పోస్తున్న కార్లాయి గ్రామ పెద్ద చెరువు



మరిపెడ రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు



డోర్నకల్: పొంగుతున్న మున్నేరువాగు

కొత్తగూడ: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కొత్తగూడ మండలం కార్లాయి గ్రామ పెద్ద చెరువు మత్తడి పోస్తోంది.

ఇనుగుర్తిని అభివృద్ధి చేస్తాం..

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

కేసముద్రం: కొత్తగా ఏర్పాటైన ఇనుగుర్తి మండలాన్ని, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో మహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పీర్ల మందిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇనుగుర్తిని మండలం చేశామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు రైతుబంధు, బీసీలకు రూ.లక్ష సాయం మాదిరిగానే, అర్హులైన మైనార్టీలకు త్వరలోనే రూ.లక్ష సాయం అందజేయనుందన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించి మూడోసారి సీఎం చేయాలని ఆయన అన్నారు. ముందుగా పీర్లమందిరంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్ల మందిరాన్ని నిర్మించిన మహ్మద్ హుస్సేన్‌ను ఆయన అభినందించారు. అనంతరం ఇనుగుర్తిలో జీపీ కార్మికులు సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ వెంకన్న, నీలం దుర్గేష్, సర్పంచ్ రామ్మూర్తి, శోభన్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు.



పీర్ల మందిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

బీఎల్‌ఓలకు శిక్షణ

నర్సింహులపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు ఓటర్ నమోదుపై శుక్రవారం నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు చెందిన బీఎల్‌ఓలకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ వివేక్ మాట్లాడారు. ఫామ్-6ను ఓటర్ నమోదు కోసం, ఫామ్-7ను పెళ్లి అయిన వారు, చనిపోయిన వారి పేర్ల తొలిగింపు కోసం, ఫామ్-8ను తప్పులు ఉంటే సవరణలు, మార్పులు చేసుకోవడం, వేరే ప్రాంతానికి వెళ్లడం కోసం, ఫామ్-6ఏను విదేశాల్లో ఉన్న వారి కోసం ఉపయోగించాలని బీఎల్‌ఓలకు సూచించారు. నూతనంగా వచ్చిన 2.0 యాప్ గురించి వివరించారు. తహసీల్దార్ శివాణి, ట్రైనర్లు మధుసూదన్, శ్రీధర్, నాగముని, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పనుల అడ్డగింత

బయ్యారం: బయ్యారం పంచాయతీ పరిధిలో ప్రైవేట్ సిబ్బందితో శుక్రవారం నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది జేఏసీ నాయకులు ఎంపీఓ వెంకటరమణతో వాగ్వాదానికి దిగారు. సమ్మె పరిష్కారం అయ్యే వరకు పనులు చేపట్టొద్దని పనులు నిలిపివేయించారు.

బ్రిడ్జి నిర్మించాలని మోకాళ్లపై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

గార్ల: పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ శుక్రవారం ఏటి వద్ద అఖిలపక్ష పార్టీల నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ 30 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నా తమ గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు జిల్లా కేంద్రంకు పాదయాత్రలు, గార్లలో నిరాహార దీక్షలు చేపట్టినా ఫలితం లేదని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, వెంకన్న, సక్రు, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

మరిపెడ: భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన చేస్తున్న సంఘటన మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామానికి చెందిన చారి నాగేశ్వర్‌రావు, దుర్గమ్మ దంపతుల కుమార్తె సోనియాను ఈ ఏడాది మరిపెడకు చెందిన జినక ఇద్దయ్య, అరుణ దంపతుల కుమారుడు వెంకటేష్‌తో వివాహం జరిగింది. వెంకటేష్ హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో భార్యభర్తల ఇరువురి మధ్య నెలకున్న మనస్పర్థల కారణంగా ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం పోలీస్‌స్టేషన్‌లో భార్య తల్లిదండ్రులు వెంకటేష్‌పై ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో నా భర్త నాకే కావాలంటు భర్త ఇంటి ఎదుట భార్య సోనియా కుటుంబ సభ్యులతో సహా ఆందోళనకు దిగింది. స్థానిక ఎస్సై పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.



భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భార్య

విరిగిన విద్యుత్ స్తంభాలు

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిదిలోని కంకరబోడ్ ప్రాంతంలోని లాల్ బహదూర్ హైస్కూల్ ఎదురుగా ఉన్న గల్లీలో గురువారం రాత్రి కురుస్తున్న వర్షాలకు చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. వార్డు కౌన్సిలర్ సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి దగ్గర ఉండి పనులు పూర్తి చేయించారు. కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

చైతన్య సారథి.. దాశరథి

- నేడు దాశరథి కృష్ణమాచార్యులు జయంతి

చిన్నగూడూరు: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. నిజాం పాలకుల చేతిలో దోపిడీకి గురై సమస్యలతో సతమతమవుతున్న తెలంగాణ ప్రాంత ప్రజల్లో తన రచనలతో చైతన్యం తీసుకొచ్చారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం. చిన్నగూడూరు మండల కేంద్రంలో వెంకటాచార్యులు-వెంకటమ్మ దంపతులకు 1925 జూలై 22న దాశరథి కృష్ణమాచార్యులు జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం గూడూరులో ప్రారంభమైనప్పటికీ ఖమ్మం జిల్లా మధిరలో సాగింది. ఆయన చదువంతా ఉర్దూ భాషలో కొనసాగింది. కాగా అప్పటి పరిస్థితుల దృష్ట్యా వారి కుటుంబం గార్లకు తరలివెళ్లింది. అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేశారు. అప్పటి భూస్వాములు, పెత్తందార్ల ఆగడాలను అరికట్టేందుకు రచనలపై మక్కువ పెంచుకుని తన కవితల ద్వారా తెలంగాణ ప్రజలను చైతన్యపరిచారు. నిజాం ప్రభువులను ఎదిరించి జైలు జీవితం అనుభవించారు. చివరికి పోలీసు చర్య తర్వాత విడుదలయ్యారు. దాశరథి కవిగా, సినీ గేయ రచయితగా ఎన్నో రచనలు చేశారు. అవి ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చాయి. 1987 నవంబర్ 5న ఆయన తుదిశ్వాస విడిచారు.

ముమ్మర ఏర్పాట్లు..

దాశరథి జయంతిని పురస్కరించుకొని వివిధ సంఘాలు, పార్టీల నాయకులు మండల కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.



మండల కేంద్రంలో దాశరథి విగ్రహం



దాశరథి (ఫైల్)

దోషులను కఠినంగా శిక్షించాలి



నెహ్రూసెంటర్: మాట్లాడుతున్న చంద్రన్న



కేసముద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ..

నెహ్రూసెంటర్: మణిపూర్ రాష్ట్రంలోని ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, పూనెం ప్రభాకర్, జగ్గన్న, వీరన్న, సూర్యం, పాల్గొన్నారు. మణిపూర్ మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో దోషులను ఉరితీయాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు కిషన్‌నాయక్ అన్నారు

మహబూబాబాద్ అర్బన్: మణిపూర్ అల్లర్లకు పాల్పడిన వారిని, మహిళలపై హత్యలు మానభంగాలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ తప్పెట్ల వీరన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లాకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో దళితరత్న కామ సంజీవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామేలు, నాయకులు బాబు పాల్గొన్నారు.

నెల్లికుదురు: మణిపూర్‌లో మహిళలపై జరిగిన సంఘటన అనాగరికతకు నిదర్శనమని, దీనికి ప్రధాని, హోంమంత్రులు బాధ్యత వహించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు హెచ్.వెంకటేశ్వర్లు, పీవైఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరుగు అనిల్ అన్నారు. మండలంలో శుక్రవారం వేర్వేరుగా మట్లాడారు.

కేసముద్రం: మణిపూర్ రాష్ట్రంలో ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం, హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదే విధంగా మండల కేంద్రంలో శుక్రవారం ఏఐసీటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

గార్ల: మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలని ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు నాగమణి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రోజ, అబ్బమ్మ, శారద, కల్యాణి, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కేసముద్రం: ఎస్సీ వర్గీకరణకు కేంద్రం చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ కేసముద్రం, ఇనుగుర్తి మండలాల ఇన్‌చార్జ్‌లు కంటిపుడి అరుణ్‌కుమార్, పోలెపాక ప్రవీణ్‌కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఈనెల 24న అమీనాపురం గ్రామానికి మంద కృష్ణమాదిగ రానున్నట్లు తెలిపారు.

పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో మూడిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ యోగేశ్వరరావు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఎర్రబెల్లిగూడెం, పెద్దతండా, బ్రాహ్మణకొత్తపల్లి గ్రామాలల్లో మూడు ఇళ్లు దెబ్బతిన్నట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలువురికి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అజిత్ మియా పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్, టెన్త్ అడ్మిషన్లు ప్రారంభం

కురవి: ఓపెన్ ఇంటర్మీడియట్, పదో తరగతిలో ప్రవేశాల కోసం అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని సిద్దార్థ పాఠశాల హెచ్ఎం ఎ.కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఫెయిల్, ఇంటర్ ఫెయిల్ అయిన వారు, చదువులను మధ్యలో ఆపివేసిన వారందరు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశం పొందే అవకాశం ఉందన్నారు. ధృవపత్రాలతో సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98852 14380 సంప్రదించాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

మహబూబాబాద్ రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని మహబూబాబాద్ రూరల్ ఎస్సై రాంచరణ్ అన్నారు. రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఈదులపూసపల్లి రోడ్డులో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు.

డీఎస్పీ విచారణ

బయ్యారం: మండలంలోని జగత్‌రావుపేటలో భూవివాదంలో ఎంపీపీ మౌనికతో పాటు ఇతరులపై అందిన ఫిర్యాదుల మేరకు డీఎస్పీ సత్యనారాయణ శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన బాణోత్ కోటేష్ పాకను తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంట సీఐ బాలాజీ, ఎస్సై ఉపేందర్ ఉన్నారు.

విజయవంతం చేయాలి

దంతాలపల్లి: సీపీఎస్ రద్దు కోరుతూ జేఎఫ్ఆర్ఓపీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 23న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎనుముల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

మరిపెడ రూరల్: మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జర్పులతండాకు చెందిన రైతు భీమా గురువారం తన పశువులను మేత నిమిత్తం తండా శివారులోకి తోలుకెళ్లాడు. వర్షానికి స్తంభాల మధ్య విద్యుత్ తీగ తెగి కిందపడింది. గడ్డి మేస్తున్న ఆవు తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి అక్కడి అక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని రైతు భీమా బోరున విలపించాడు. మూడు రోజుల క్రితమే తీగులు తెగిపడ్డాయని, విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోలేదన్నారు.

అత్యాచార నిందితుడి అరెస్టు



నెల్లికుదురు: ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు తొర్రూర్ సీఐ సత్యనారాయణ తెలిపారు. నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మండలంలోని తారాసింగ్ బావితండాకు చెందిన జాటోతు దయాకర్ డ్రైవర్‌గా పనిచేసున్నాడు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికకు మాయమాటలు చెప్పిన జాటోతు దయాకర్ అత్యాచారం చేసినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దయాకర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి ముదిరాజ్ మత్స్యకారుడు బాషబోయిన రాంబాబు మృతికి కారణమైన వ్యక్తిగా గుగులోత్ రవి అనే వ్యక్తిపై మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై రాంచరణ్ శుక్రవారం తెలిపారు. సదరు గుగులోత్ రవి హైదరాబాదులో ఓ ప్రభుత్వ సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నట్లు తెలిసిందని విచారణ చేపట్టి అతడిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా రవి ఏఆర్ కానిస్టేబుల్ అని మంత్రి సత్యవతి రాథోడ్ కాన్వాయిలోని పైలట్ వాహనంలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఆయన స్వగ్రామం గూడూరు మండలంలోని అయోధ్యాపురం కాగా ఆయన తన విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.

కొడుకుతో ఘర్షణ పడి తల్లి గొంతుకోసిన వ్యక్తి

బయ్యారం : కొడుకుతో ఘర్షణ పడిన వ్యక్తి అతని తల్లి గొంతుకోసి తన ప్రతీకారాన్ని తీర్చుకున్న ఈ ఘటన శుక్రవారం మండలంలోని కొత్త ఇర్సులాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గండెల అర్జున్‌తో అదే గ్రామానికి చెందిన ఉంద్రాతి రాంబాబు తన పొలంలో నుంచి ట్రాక్టర్‌ను తీసుకపోవద్దని వాగ్వాదానికి దిగాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న రాంబాబును అర్జున్ వారించి ట్రాక్టర్‌ను తీసుకొని ఇంటికి వెళ్లాడు. తనను వారించి ట్రాక్టర్‌తో వెళ్లిపోయాడనే ఆగ్రహంతో రాంబాబు తన ఇంట్లో ఉన్న కత్తిని తీసుకొని అర్జున్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అర్జున్ తల్లి కళమ్మ మిరపకాయల తొడిమెలు తీస్తుండగా వెనుక నుంచి కత్తితో గొంతు కోశాడు. ఆమె కేకలు వేయగా రాంబాబు అక్కడి నుండి పరారయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కళమ్మను మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు. గొంతు కోసిన రాంబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



గాయపడిన కళమ్మ

వాగులో పడి పశువుల కాపరి మృతి

బయ్యారం: పశువులు మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులోపడి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని కాచనపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొగ్గెల పాపారావు(60) ఉదయం పశువులను మేపేందుకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవటంతో శుక్రవారం అతని ఆచూకీ కోసం గాలించగా మృతదేహం లభ్యమైంది.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..!

పెద్దవంగర: రోగాల బారిన పడి చనిపోయే వారి కన్నా.. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చుచేసి రోడ్లు వేస్తున్నా.. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ లేక చిన్నపాటి వర్షానికే రోడ్లపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారుతున్నాయి. తొర్రూరు పట్టణ కేంద్రం నుంచి పెద్దవంగర మండల కేంద్రం మీదుగా సూర్యాపేట జిల్లా తిర్మలగిరి, యాదాద్రి జిల్లా మోత్కూర్, వలిగొండ, హైదరాబాద్‌కు ప్రతిరోజు వందల సంఖ్యల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. కాగా పెద్దవంగర మండల పరిధిలోని సూమారు 10 కిలోమీటర్లు ఎల్బీతండా, బీసీ తండా, చిన్నవంగర సమీపంలోని కిష్టుతండా వద్ద పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ప్రస్తుతం మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈ రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు చేరి ద్విచక్రవాహనాల సైలెన్సర్ల వరకు నీటి మునుగుతున్నాయి. రాత్రి వేళల్లో వర్షం నీరు నిలిచి భారీ గుంతలు కనిపించంక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వలిగొండ టు భద్రాచలం..

వలిగొండ నుంచి భద్రాచలం వరకు పెద్దవంగర మండల మీదుగా జాతీయ రహదారి మంజూరు కాగా ఇటీవల రోడ్డుకు ఇరువైపుల చెట్లను తొలగించి సైడ్ డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. జాతీయ రహదారి అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాల్సి బాధ్యత వారిపైనే ఉంది. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్డులో కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి బురదమయంగా మారడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్దవంగర మండలంలోని కిష్టుతండాలో గుంతలు పడిన రోడ్డు..



నెహ్రూసెంటర్: నీరు నిలిచి బురదమయంగా మారిన రోడ్డు

జీపీ ఉద్యోగుల వేతనాలు పెంచాలి



డోర్నకల్: ర్యాలీ నిర్వహిస్తున్న జీపీ కార్మికులు



గార్ల: మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

సాక్షి నెట్‌వర్క్: ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 16 వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు జీపీ కార్మికులు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదన్నారు.

భలేగుంది.. బైక్‌పై గొడుగు



కేసముద్రం: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు తడవకుండా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బ్లూకోట్స్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజు, తన బైక్‌కు ఇటీవల గొడుగును ఏర్పాటు చేశాడు. విధులకు వెళ్తున్న సమయంలో వర్షం ఆటంకం కలిగిస్తుండటంతో, అతడు రూ.9వేలు వెచ్చించి ఆన్‌లైన్ ద్వారా గొడుగు తెప్పించి, బైక్‌కు ఏర్పాటు చేశాడు. వర్షంలో తడవకుండా వెళ్తున్న ఆ బైక్‌ను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.